సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



టన్ను చీనీ రూ.18 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 593 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ. 26
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.26, కనిష్టంగా రూ.13 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.4°/ 23.2°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్


ఎంజేపీలో నాన్‌టీచింగ్ ఉద్యోగుల తొలగింపు
- టీడీపీ నాయకుల ఒత్తిడే కారణమని బాధితుల ఆవేదన



ఉద్యోగాల నుంచి తొలగించడంతో పాఠశాల బయట వేచి ఉన్న సిబ్బంది

రొద్దం: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలురు గురుకుల పాఠశాలలో ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందిని గురువారం తొలగించారు. రికార్డు అసిస్టెంట్ సతీష్‌కుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్ మధుసూదన్ రెడ్డి, నైట్ వాచ్‌మెన్ మహబూబ్‌బాషా, డే వాచ్‌మెన్ నరసింహమూర్తిని విధుల నుంచి తొలగిస్తూ విజయవాడలోని ఎంజేపీ స్కూల్స్ సెక్రటరీ నుంచి మెయిల్ వచ్చినట్లు బాధితులు తెలిపారు. తమపై ఎలాంటి ఆరోపణలు లేకున్నా టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి తమను అన్యాయంగా తొలగించారన్నారు. పాఠశాలకు వచ్చి తమ పార్టీ అధికారంలో ఉందనీ, తాము చెప్పినట్లు వినాలని ఇక్కడి నుంచి వెళ్లి పోవాలని టీడీపీ నాయకులు నానా బూతులు తిట్టినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఎందుకు తొలగించారని ప్రిన్సిపాల్‌ను అడిగితే సెక్రెటరీని అడగాలని సమాధానం చెప్పినట్లు పేర్కొన్నారు. తమను ఏకారణం లేకుండా తొలగించడంపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కళ తగ్గని టీబీ డ్యాం



తుంగభద్ర జలాశయం గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. బుధవారం 1,05,973 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో గురువారం సాయంత్రానికి 1,98,109 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో డ్యాం 33 గేట్లను ఎత్తి 1,65,915 క్యూసెక్కుల నీటిని నదికి విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 97.870 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,631 అడుగులకు నీరు చేరింది.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న మారెమ్మ మూలవిరాట్

రొళ్ల: మండలంలోని టీడీ పల్లిలో వెలసిన గ్రామ దేవత మారెమ్మకు గురువారం గ్రామస్తులు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. ఏటా ఆషాఢ మాసంలో మారెమ్మకు జ్యోతుల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఆలయంలో మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరించారు. మహిళలు జ్యోతులను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు భాగా పండాలని పూజలు చేశారు. గురువారం రాత్రి ప్రతి ఇంటి ఆవరణలో ముద్దేమారమ్మ ప్రతిమకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎస్సీ కాలనీలో వెలసిన అట్టి మారెమ్మకు కాలనీ వాసులు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు.



జ్యోతులను తీసుకెళ్తున్న భక్తులు

తమ్ముళ్లు చెప్పినోళ్లకే పింఛన్!

- గత నెలలో బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామంలో సుమారు 40 మందికి పింఛన్ ఇవ్వలేదు. ఉన్నతాధికారులను సంప్రదించగా.. ఆగస్టులో ఇస్తామని చెప్పారు. కానీ ఇప్పుడు కేవలం ఒక నెల పింఛన్ మాత్రమే ఇచ్చారు. గత నెలలో అందజేయాల్సిన రూ.7 వేలు ఇవ్వలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- రామగిరి మండలం పేరూరు పంచాయతీలో 60 మందికి పింఛన్ ఇవ్వలేదు. ఎంసీ పల్లి, పోలేపల్లి, రామగిరి పంచాయతీల్లో గత నెలలోనే 210 మందికి ఇవ్వలేదు. ఈసారి కూడా వాళ్లందరికీ పింఛన్ ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.
- రొద్దం మండలం నారినాగేపల్లి గ్రామానికి చెందిన మస్తాన్ అనే వ్యక్తి పేరు జాబితాలో లేదని సాకు చెబుతూ పింఛన్ సొమ్ము ఇవ్వకుండా అధికారులు వెనక్కి పంపారు. మరికొందరు కూడా తమకు పింఛన్ ఇవ్వలేదని వాపోతున్నారు.
- కనగానపల్లి మండలం ముక్తాపురంలో 10, మామిళ్లపల్లి 12, చంద్రాచెర్ల 15, కోనాపురంలో 25, భానుకోటలో 50, వేపకుంటలో 22, మద్దెలచెరువులో 12, తూముచెర్లలో 12 మందికి పింఛన్ ఇవ్వలేదు.
- ధర్మవరం నియోజకవర్గంలోని గొట్లూరు గ్రామ పరిధిలో అనిల్ అనే ఓ వ్యక్తి పింఛన్ పింపిణీ సమయంలో ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ. 1000 వసూలు చేసినట్లు సోషల్ మీడియాలో వాయిస్ రికార్డు వైరలవుతోంది.
- పెనుకొండ నగర పంచాయతీలోని వెంకటరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేసులు, సుబ్బన్నకు పింఛన్‌రాకుండా టీడీపీ నాయకులు అడ్డుపడ్డారు. ఉన్నతాధికారి , ఓ ముఖ్య నాయకుడు పింఛన్ ఇవ్వకూడదని సచివాలయ సిబ్బందికి చెప్పినట్లు వెంకటేసులు తెలిపారు.



- లబ్ధిదారులపై టీడీపీ నాయకుల పెత్తనం
- జాబితాలో పేరున్నా సొమ్ము ఇవ్వకుండా అడ్డగింత
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యం
- చాలా గ్రామ పంచాయతీల్లో 70 వరకూ పింఛన్ల కోత

ఆగస్టులో మంజూరైన పింఛన్లు 2,70,853
విడుదలైన మొత్తం రూ.116.19 కోట్లు

సాక్షి, పుట్టపర్తి: గతంలో జన్మభూమి కమిటీల ద్వారా గ్రామాలను శాసించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఈసారి అధికారులను అడ్డుపెట్టుకుని పింఛన్‌దారులపై కక్ష సాధింపు చర్యలకు దిగారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రాజకీయాలకు అతీతంగా అందరూ సజావుగా పింఛన్ పంపిణీ జరగ్గా.. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి లబ్ధిదారులు కష్టాలు పడుతున్నారు.

తమ్ముళ్లదే పెత్తనం..

సామాజిక ఫింఛన్ల పంపిణీని పక్కాగా ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా... పింఛన్ ఎవరికి ఇస్తారో? ఎవరు వచ్చి ఇస్తారో? ఎక్కడికి వెళ్లి తీసుకోవాలో? తెలీక చాలామంది అవస్థలు పడుతున్నారు. ఇదే అదునుగా భావించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు.. అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల జాబితా సిద్ధం చేసి ఎంపీడీఓలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నారు. జాబితాలోని పేర్లను పరిశీలించి.. ఆ తర్వాత పింఛన్ ఇవ్వాలని ఆదేశిస్తున్నారు. వినకుంటే.. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సిఫారసు చేయిస్తున్నారు. దీంతో మండల స్థాయిలోనే పింఛన్లకు అడ్డుకట్ట పడుతోంది. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో జాబితాలో పేరు ఉన్నప్పటికీ పంచాయతీలోకి వెళ్లేసరికి జాబితాలో పేరు లేదంటూ పింఛన్ సొమ్ము ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు.



రామగిరి మండలం పేరూరు సచివాలయం వద్ద పింఛన్ ఇవ్వాలని నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

మభ్యపెడుతూ.. మోసం చేస్తూ..

గత జూలైలో బత్తలపల్లి మండలం మాల్యవంతం, రామగిరి మండల కేంద్రంతో పాటు పోలేపల్లి, ఎంసీ పల్లి పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు 210 మందికి పింఛన్లు ఇవ్వకుండా 'తెలుగు తమ్ముళ్లు' అడ్డుకున్నారు. అప్పట్లోనే బాధితులు కలెక్టరేట్‌కు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. వచ్చే నెలలో కలిపి ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఈసారి కూడా పింఛన్ ఇవ్వలేదని రామగిరి మండల బాధితులు తెలిపారు. కాగా బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామస్తులకు గత నెల పింఛన్ సొమ్ము ఇవ్వకుండా.. ఈ నెలకు సంబంధించిన సొమ్ము మాత్రమే ఇచ్చారు. కాగా ఇంకొన్ని గ్రామాల్లో వెరిఫికేషన్ పేరుతో జాప్యం చేస్తూ.. సాయంత్రం ఇస్తామని చెప్పి.. ఆ తర్వాత పంపిణీ చేసే ఉద్యోగులు దుకాణం సర్దుకుని వెళ్లిపోయారు. చాలా గ్రామాల్లో పింఛన్‌దారులు వీధి వీధి తిరిగి అలసిపోయి ఇంటికి చేరుకున్నారు.

అధికారులు ఏం చెబుతున్నారంటే..

'ఎంపీడీఓ కార్యాలయాల నుంచి వచ్చిన జాబితా ప్రకారమే పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. పరిశీలన కోసం ఆపిన వారికి కూడా సాయంత్రం ఇవ్వాలని సిబ్బందికి తెలియజేశాం. ఈమేరకు డీఆర్‌డీఏ కార్యాలయాధికారులకు కూడా చెప్పాం. ఎవరికీ ఇబ్బంది రానివ్వబోం. ఈ నెలలో అందరికీ ఇస్తాం' అని అధికారులు చెబుతుండటంతో పింఛన్ ఇస్తారేమోనని ఉదయం నుంచి చాలా మంది లబ్ధిదారుల అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఉదయం నుంచి తిరిగితే.. సాయంత్రం ఇవ్వకుండా వెళ్లిపోయారని లబ్ధిదారులు వాపోతున్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే టార్గెట్ చేసినట్లు స్పష్టంగా అర్థం అవుతోంది.

తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి



పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం అర్బన్: తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి వస్తుంది. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. పట్టణంలోని సాయినగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం తల్లిపాల వారోత్సవాలకు సంబంధించి పోస్టర్లను ఆయన విడుదల చేశారు. అనంతరం 22వ వార్డులో పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్‌రెడ్డి, డిప్యూటీ డీఎం హెచ్‌ఓ సెల్వియా సాల్మన్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో విజిలెన్స్ దాడులు



బాలప్పగారిపల్లిలో దాడులు నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండలంలో పలు గ్రామాల్లో గురువారం విద్యుత్‌శాఖకు సంబంధించిన విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా కరెంటు వాడుతున్న వారిపై 20 కేసులు నమోదుచేసి రూ. 1,85,000 అపరాధ రుసుము విధించారు. దాడుల్లో అనంతపురం విజిలెన్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గోపీ, నాగేంద్ర, అసిస్టెంట్ ఇంజనీర్ జగన్నాథం పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



పట్టుబడిన ట్రాక్టర్లు

సాక్షి ఎఫెక్ట్..

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు అక్రమార్కులను హెచ్చరించారు. గురువారం సాక్షిలో 'చిత్రవధ' శీర్షికన వెలువడిన కథనానికి ఆయన స్పందించారు. ఇందులో భాగంగానే సెబ్ సీఐ గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక టిప్పర్‌ను స్వాధీనం తీసుకున్నారు. వాటికి గురువారం తహసీల్దార్ కార్యాలయంలో జరిమానా వేసి, డబ్బు చెల్లించన తర్వాత వాహనాలను వదిలేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ట్రాక్టర్‌కు రూ.3 వేలు చొప్పున, టిప్పర్‌కు రూ.10 వేలు చొప్పున జరిమానా విధించామన్నారు.

సీఐల బదిలీ

అనంతపురం: అనంతపురం రేంజ్ డీఐజీ పరిధిలో పలువురు సీఐలు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి కొందరు సీఐలకు స్థానచలనం కలిగింది. పలు స్టేషన్లకు కొత్త సీఐలు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం డీఐజీ డాక్టర్ షిమోషి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. ఆయా పోలీసుస్టేషన్లలో వెంటనే రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. బదిలీ సీఐలను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్పీలకు సూచించారు.

బదిలీ అయిన సీఐల వివరాలిలా..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కే. రాఘవన్	ఏపీఎస్‌డీఆర్‌ఐ, విజయవాడ	స్పెషల్ బ్రాంచ్, అనంతపురం
పి. జాకీర్ హుస్సేన్	డీఎస్‌బీ అనంతపురం	వీఆర్, ఎస్పీ (డీజీపీ ఆఫీస్ అటాచ్)
ఎం. శ్రీకాంత్ యాదవ్	ప్రొద్దుటూర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్,	టూటౌన్, అనంతపురం
బి. క్రాంతి కుమార్	టూటౌన్, అనంతపురం	వీఆర్, ఎస్పీ అనంతపురం
ఎం. సుబ్రహ్మణ్యం	డీసీఆర్‌బీ,అనంతపురం	డీసీఆర్‌బీ,తిరుపతి
కే.రాజగోపాల్ నాయుడు	పీటీసీ, తిరుపతి	హిందూపురం వన్ టౌన్ పీఎస్
వి. శ్రీనివాస్	హిందూపురం వన్ టౌన్	వీఆర్ (ఎస్పీ, పుట్టపర్తి)
సి. ఆంజనేయులు	సీఐడీ ఆర్‌ఓ, తిరుపతి	హిందూపురం రూరల్ (యూపీఎస్)
వై. శ్రీనివాసులు	హిందూపురం రూరల్	వీఆర్(ఎస్పీ, పుట్టపర్తి)

పనులు నాణ్యతగా చేయండి

- డ్వామా పీడీ విజయ్‌ప్రసాద్

తాడిమర్రి: ఉపాధి హామీ పనులను నాణ్యతతో చేయాలని డ్వామా పీడీ, మండల ప్రత్యేక అధికారి విజయ్‌ప్రసాద్ కూలీలకు సూచించారు. మండలంలోని పిన్నదరి సమీపంలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న కాల్వ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల గురించి ఎంపీడీఓ మణి మంజరిని అడిగి తెలుసుకున్నారు. ఏకపాదంపల్లి నుంచి తాడిమర్రి వరకూ పీఏబీఆర్ కాల్వలో కంప చెట్లు తొలగింపు, పూడికతీత పనుల కోసం రూ.10 లక్షలు ఎస్టిమేషన్ వేసినట్లు పేర్కొన్నారు. పీడీ మాట్లాడుతూ పీఏబీఆర్ కాల్వలో నీరు వెళ్లడానికి అనుకూలంగా నాణ్యతతో పనులు చేయాలన్నారు. అనంతరం ఆయన నార్శింపల్లి గ్రామంలో సాగు చేస్తున్న పండ్ల తోటల రైతులను కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయన పిన్నదరిలో సచివాలయ సిబ్బంది గురువారం చేపట్టిన సామాజిక భద్రత పింఛన్ల కార్యక్రమాన్ని పరిశీలించారు. పింఛన్‌దారుల ఇళ్లవద్దకే వెళ్లి సకాలంలో అందరికీ పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ సంజీవరెడ్డి, ఈసీ అశోక్‌కుమార్‌రెడ్డి, హార్టికల్చర్ సూపర్‌వైజర్ అరుణ, టీఏ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పిన్నదరి సమీపంలో జరుగుతున్న పీఏబీఆర్ కాల్వ పనులను పరిశీలిస్తున్న పీడీ

మళ్లీ పాత పాటే



ప్రజావేదికలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



పట్టుపురుగులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

- మడకశిర పర్యటనలో 2014 హామీలనే గుప్పించిన సీఎం
- తప్పుడు హామీలపై ప్రజల విస్మయం
- సీఎం కార్యక్రమంలో పాల్గొనేందుకు టీడీపీ క్యాడర్‌కు దొరకని అవకాశం
- అసంతృప్తిలో తమ్ముళ్లు

మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం మడకశిర నియోజకవర్గం పర్యటన ప్రజలను నిరాశకు గురిచేసింది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సీఎం చంద్రబాబు మడకశిర మండలంలోని కే గుండుమల గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని కరియమ్మదేవి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అయితే మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి 2014లో సాధారణ ఎన్నికల సందర్భంగా ఏ హామీలైతే ఇచ్చారో మళ్లీ అవే హామీలిచ్చి నియోజకవర్గ ప్రజలను మరోసారి మభ్య పెట్టారు. చంద్రబాబు తప్పుడు హామీలతో నియోజకవర్గ ప్రజలు విస్మయానికి గురయ్యారు. ముఖ్యంగా 2014లో హంద్రీనీవా కాలువను పూర్తి చేసి నియోజకవర్గంలోని అన్ని చెరువులకు కృష్ణా జలాలు అందిస్తానన్నారు. తన ఐదేళ్ల పాలనలో ఆ హామీని మాత్రం నెరవేర్చలేదు. అలాగే మడకశిర పారిశ్రామికవాడలో పరిశ్రమలు చేస్తామని పట్టించుకోలేదు. కనీసం భూములిచ్చిన రైతులకు నష్ట పరిహారం కూడా చెల్లించలేదు. గుడిబండ మండలంలోని రాళ్లపల్లి వద్ద హంద్రీనీవా రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని చేయలేదు. అలాగే మడకశిరకు రింగ్‌రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసినా పనులను మాత్రం ప్రారంభించలేదు. 2014లోనే వక్క రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇందులో ఏ ఒక్క హామీని ఆయన నెరవేర్చలేదు. మళ్లీ అవే హామీలను చంద్రబాబు గురువారం గుండుమలలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో గుప్పించారు.

టీడీపీ కార్యకర్తల అసంతృప్తి

నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు జరిపిన పర్యటనపై పలువురు టీడీపీ కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ పర్యటనలో టీడీపీకి చెందిన ముఖ్య నాయకులు చంద్రబాబును కలవడానికి అవకాశం దొరకలేదు. కేవలం ఆయన గుండుమల ప్రజలతో మాట్లాడి వెళ్లిపోయారు. కనీసం నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలవడానికి కూడా చంద్రబాబు అవకాశం ఇవ్వకపోవడం చాలా అన్యాయమని తమ్ముళ్లు వాపోతున్నారు. ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకు కార్యకర్తలు గుర్తుకువస్తారని, అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే ఈరన్న వర్గానికి చెందిన ముఖ్య నాయకులకు కూడా చంద్రబాబు పర్యటనలో పాల్గొనడానికి పాసులు దొరక్కపోవడంతో ఆ వర్గం నాయకుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఇబ్బంది పడిన ప్రజలు..

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా కే గుండుమల గ్రామంలోకి ఇతర గ్రామాలకు చెందిన వారు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. కదిరేపల్లిక్రాస్, మెళవాయి, మడకశిరలోని గుండుమల క్రాస్ తదితర రోడ్లను మూసేసారు. దీంతో ఉదయం నుంచి సాయంకాలం వరకూ మెళవాయి, పాపసానిపల్లి, కోతలగుట్ట, కొడిగానిపల్లి, సింగేపల్లి, సిద్దగిరి తదితర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డారు.

నోటీసులు సరికాదు..

చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పలువురికి పోలీసులు ముందు జాగ్రత్తగా నోటీసులు ఇచ్చి ఇబ్బందులు పెట్టారు. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ నేత, ఏడీసీసీ బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షుడు ఆనంరంగారెడ్డి, డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హనుమంతుకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వ తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎం కోసం నిరీక్షణ..

ముఖ్యమంత్రి చంద్రబాబు కే గుండుమల గ్రామానికి రెండు గంటల ఆలస్యంగా వచ్చారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1.45 గంటలకు రావాల్సి ఉండగా 3.45 గంటలకు వచ్చారు. చంద్రబాబు పర్యటనకు తరలించిన జనం ఉదయం నుంచి గంటల తరబడి వేచిచూశారు. వారితో పాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర, జిల్లా అధికారులు కూడా వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హంద్రీనీవాకు నీటి విడుదల



మల్యాల వద్ద హంద్రీనీవాకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

- రెండు పంపుల ద్వారా 1,000 క్యూసెక్కులు ఎత్తిపోత
- 6 రోజుల్లో జీడిపల్లి రిజర్వాయర్ చేరుకోనున్న కృష్ణాజలాలు

అనంతపురం సెంట్రల్: శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఎట్టకేలకు నీరు విడుదలయ్యాయి. గురువారం నంద్యాల జిల్లా నందికొట్కూరు మండల పరిధిలో మల్యాల వద్ద హంద్రీనీవా అధికారులు, ఆ జిల్లా ప్రజాప్రతినిధులు రెండు పంపుల ద్వారా 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో నాలుగు రోజులకు జిల్లా సరిహద్దులోకి, 6 రోజులకు జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణాజలాలు చేరుకుంటాయని హంద్రీనీవా అధికారవర్గాలు వెల్లడించాయి.

ఆలస్యంగా.. అరకొరగా

వాస్తవానికి హంద్రీనీవాకు చాలా రోజుల క్రితమే నీటిని విడుదల చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కృష్ణా జలాలు రావడానికి తీవ్ర ఆలస్యమైంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 830 అడుగులకు చేరుకోగానే హంద్రీనీవా ద్వారా నీటిని ఎత్తిపోయడానికి ఆస్కారం ఏర్పడుతుంది. 10 రోజుల క్రితమే ఆ మేర నీరు చేరాయి. కానీ, టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు చెందిన కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్వాకం కారణంగా నీరు రావడం ఆలస్యమైంది. కర్నూలు జిల్లాలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న సుధాకర్‌యాదవ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ హంద్రీనీవా కాలువను మట్టితో పూడ్చి దానిపై తాత్కాలిక రోడ్డు వేయడంతో దుస్థితి నెలకొంది. సదరు కంపెనీకి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు కూడా నీటి విడుదలలో జాప్యం చేశారు. అయితే, నాలుగు రోజుల క్రితం సాక్షి ప్రధాన సంచికలో 'పుట్టా పాపం.. సీమకు శాపం' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో ఆగమేఘాలపై స్పందించి తాత్కాలికంగా పైపులను అమర్చి నీటిని విడుదల చేస్తున్నారు. అయితే ఆ పైపులు కూడా చిన్నవిగా ఉండడంతో కేవలం 1,000 క్యూసెక్కులు నీరు మాత్రమే వస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో హంద్రీనీవా కాలవను నిర్మించారు. అయితే కాలవకు లైనింగ్ లేకపోవడం, ఇతరత్రా ఇబ్బందుల కారణంగా 2,200 క్యూసెక్కుల నుంచి 2400 క్యూసెక్కుల వరకూ నీటిని తీసుకుంటున్నారు. ఆ నీటిని కూడా తరలించడంలో కూటమి ప్రభుత్వం విఫలమవుతోంది. కాగా, హంద్రీనీవా ప్రాజెక్టు శ్రీశైలం మిగులు జలాలపై ఆధారపడి ఉంది. వరద వచ్చే సమయంలో వీలైనంత ఎక్కువ నీటిని తోడి తరలించాల్సి ఉంది.

క్లుప్తంగా

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



సోమందేపల్లి/హిందూపురం అర్బన్: మండలంలోని బ్రాహ్మణపల్లి రైల్వే గేటు సమీపంలో రైలు నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ బాలాజీనాయక్ తెలిపిన మేరకు... గురువారం వేకువజామున హంపి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న వ్యక్తి (40) మలగూరు రైల్వే స్టేషన్ సమీపంలోకి చేరుకోగానే అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలైన ఆయనను స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్ ద్వారా హిందూపురంలోని జిల్లాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మధ్యాహ్నం ఆయన మృతి చెందారు. కాగా, మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఆచూకీ తెలిసిన వారు హిందూపురం రైల్వే పోలీసులను సంప్రదించాలని జీఆర్పీ ఎస్‌ఐ బాలాజీ నాయక్ కోరారు.

ఎస్టీయూ నేత సూర్యనారాయణగౌడ్ మృతి



సూర్యనారాయణగౌడ్ (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సీనియర్ నాయకుడు, రాప్తాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఇంగ్లిష్ టీచరుగా పనిచేస్తున్న అక్కిలి సూర్యనారాయణ గౌడ్ (59) మృతి చెందారు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన బెంగళూరులో చికిత్స తీసుకునేవారు. ఇటీవల ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్సకు స్పందించక గురువారం ఉదయం కన్నుమూశారు. పెద్దవడుగూరు మండలం చిట్టూరు గ్రామానికి చెందిన సూర్యనారాయణగౌడ్ 1996 డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. ఆ తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. వామపక్ష భావజాలం ఎక్కువగా ఉన్న ఆయన విద్యార్థి దశలోనే ఏఐఎస్‌ఎఫ్‌లో కీలకంగా పని చేశారు. టీచరుగా ఉద్యోగం వచ్చిన తర్వాత సీపీఐ అనుబంధ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ)లోనూ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అనేక ఉద్యమాలకు ప్రాతినిధ్యం వహించి మంచి పేరు గుర్తింపు తెచ్చుకున్నారు.

యువకుడి మృతి



మృతుడు సాయినాథ్

కొత్తచెరువు: ఆటోను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కొత్తచెరువు మండలం బండ్లపల్లి పంచాయతీ వన్నూరపల్లికి చెందిన సాయినాథ్ (30) కియా పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి తన స్వగ్రామం నుంచి పుట్టపర్తికి ద్విచక్రవాహనంపై వెళుతున్న ఆయన కొత్తచెరువు మండలం అప్పలవాండ్లపల్లి సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వెళుతున్న పాల ఆటోను ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, సాయినాథ్‌కు ఆరు నెలల క్రితమే వివాహమైంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సంస్కరణలు తెచ్చి.. వెలుగులు పంచి!



బోరులో నీరున్నా.... పంట పెట్టాలంటే భయమేసేది. పొలాలను బీళ్లుగా వదిలేసి రైతులు వలస బాట పట్టేవారు. విద్యుత్ సరఫరా ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియక ఒకప్పుడు ఈ దుస్థితి ఉండేది. అధికారులను అడిగితే సమాధానమే ఉండదు. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని దరఖాస్తు చేస్తే సరైన స్పందన ఉండదు. దశాబ్దాలుగా సమస్యలు నెలకొన్నా ఏ ప్రభుత్వమూ స్పందించింది లేదు. ఇక పరిస్థితి ఇంతే అనుకుంటున్న తరుణంలో వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. రైతుల కష్టాలన్నింటినీ తీర్చేసింది.

- ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్రలో 2019–24లోనే విద్యుత్ సంస్కరణలు
- ఐదేళ్లలో 94 వేలకు పైగా విద్యుత్ సర్వీసులు మంజూరు
- గడిచిన రెండేళ్లలో రూ.70 కోట్లతో 9,612 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి సబ్‌స్టేషన్ల నిర్మాణం
- గతంలో ఎన్నడూ లేని విధంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు



వైఎస్ జగన్ హయాంలో శెట్టూరు మండలం ములకలేడు వద్ద నిర్మించిన విద్యుత్ సబ్ స్టేషన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కరువు ప్రాంతం... వర్షం అంతంతే.. బోర్ల కిందే వ్యవసాయం. కరెంటు ఉంటే గానీ పైరు పండని పరిస్థితి. ఇలాంటి ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విధంగా గడిచిన ఐదేళ్లలోనే సంస్కరణలు అమలయ్యాయి. కరెంటు ఎప్పుడొస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నుంచి 9 గంటలపాటు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందించే దశకు తీసుకొచ్చారు. దీంతోపాటు అత్యాధునిక ఫీడర్లు, కొత్త ఉపకరణాలను ఏర్పాటు చేసి రైతులు, గృహ వినియోగదారులకు ఊరట కల్పించారు.

లో ఓల్టేజీకి చెక్..

2019 ముందు ఉమ్మడి జిల్లాలో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకుంటే రెండేళ్లు పట్టేది. కానీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అలాంటి దుస్థితి పూర్తిగా దూరమైంది. రైతులు దరఖాస్తు చేసుకున్న రెండు లేదా మూడు నెలల్లోనే ట్రాన్స్‌ఫార్మర్ వచ్చేలా చేశారు. లోవోల్టేజీ సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న రైతులకు ఉపశమనం కల్పించారు. ఉమ్మడి జిల్లాలోనే 9 వేలకు పైగా ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటు చేసి రికార్డు సృష్టించారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఎక్కువ వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చిన జిల్లాగా ఉమ్మడి జిల్లా రికార్డు సృష్టించింది. 33 కేవీ విద్యుత్ లైన్లు, కొత్త ఫీడర్లు, పవర్ ట్రాన్స్‌పార్మర్లు ఇలా ఒకటేమిటి రూ. వందల కోట్ల వ్యయంతో మౌలిక వసతులు కల్పించారు. ఉచితంగా 9 గంటల నిరంత విద్యుత్ ఇవ్వడంతో పాటు లోవోల్టేజీతో మోటార్లు కాలిపోయే పరిస్థితికి పూర్తిగా చెక్‌పెట్టారు. కనీవినీ ఎరుగని రీతిలో కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసి విద్యుత్ సంస్కరణల్లో కొత్త శకాన్ని ఆవిష్కరించారు. పూర్తిగా బోరుబావుల మీదే ఆధారపడ్డ రైతన్నలకు గడిచిన ఐదేళ్లలో కల్పించిన విద్యుత్ సంస్కరణలు పూర్తిగా ఉపశమనం కల్పించాయి.

అంటకాగారంటూ విష ప్రచారం..

రాష్ట్ర చరిత్రలోనే ఉమ్మడి జిల్లాలో అద్భుతమైన విద్యుత్ సంస్కరణలు చేపట్టగా... కూటమి ప్రభుత్వం, తమ అనుకూల మీడియా కలిపి అధికారులందరూ గత ప్రభుత్వానికి అంటకాగారంటూ దుష్ప్రచారం చేశారు. ఈ విషయం తమనెంతో మనోవేదనకు గురి చేసిందని కొంతమంది అధికారులు వాపోతున్నారు. వివిధ ప్రాంతాల్లో ఏఈలు మొదలుకొని ఉన్నతాధికారుల వరకూ రేయింబవళ్లు కష్టపడి పనిచేసి అత్యాధునిక మౌలిక వసతులు కల్పించామని, ఈ ఫలాలు ఇప్పుడు రైతులు అనుభవిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఎల్లో మీడియా ఇలా అధికారులను పార్టీలకు అంటగట్టడం దారుణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో విద్యుత్ సంస్కరణలు ఇలా..

కేటగిరీ	సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
వ్యవసాయ కనెక్షన్లు	94,060	--
ట్రాన్స్‌ఫార్మర్లు	9,612	270.82
సబ్‌స్టేషన్లు	46	161
పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు	114	53.76
33కెవీ ఫీడర్లు	11	40.26
11కేవీ ఫీడర్లు	19	13.93
హౌసింగ్ కాలనీలు	349	88.32
11 కేవీ ఫీడర్లు	593	1334.23
కొత్త సబ్‌స్టేషన్ల ప్రతిపాదన	273	955.5
విద్యుత్ లైన్ వివరాలు		
33 కేవీ కొత్త ఫీడర్లు	579.5 కిమీ	రూ.50.6 కోట్లు
33 కేవీ లైను	42.4 కి.మీ	రూ.98.83 కోట్లు

పింఛన్‌ల కోసం నిరీక్షణ ఉండదు





పింఛన్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి సవిత, పెనుకొండలో పింఛన్ పంపిణీలో పాల్గొన్న కలెక్టర్ చేతన్

పెనుకొండ/రూరల్: ప్రతి నెలా పింఛన్లు తీసుకోవడంలో ఎలాంటి నిరీక్షణ ఉండదని మంత్రి సవిత అన్నారు. పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటరెడ్డిపల్లి, మండలంలోని గుట్టూరు, కురుబవాండ్లపల్లిలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆమె పాల్గొన్నారు. అనంతరం గుట్టూరు జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని దుద్దేబండలో చేపట్టిన పింఛన్ల పంపిణీని సెర్ప్ సీఈఓ వీరపాండ్యన్ పరిశీలించారు.

96 శాతం పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని 1వ తేదీనే వంద శాతం పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. మొదటి రోజు రాత్రి 7 గంటల వరకూ దాదాపు 96 శాతం పంపిణీ పూర్తి చేశారు. జిల్లాలోని 32 మండలాల్లో లబ్ధిదారులు 2,69,207 మందికి రూ.115,53,56,000ను ప్రభుత్వం మంజూరు చేసింది. 2,59,292 మంది లబ్ధిదారులకు రూ.111,19,60,500 నగదు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో జిల్లా 24వ స్థానంలో నిలిచింది. ఒక్క రోజే పంపిణీ చేయాలన్న ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో తక్కిన 9,915 మంది పరిస్థితి అర్థం కావడం లేదు. మిగిలిన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేస్తారా? లేక తిరిగి పంపుతారా అనేది అర్థం కావడం లేదు.

వాస్తవాలు కప్పిపుచ్చొద్దు కేశవ్



విలేకరులతో మాట్లాడుతున్న రాంభూపాల్



బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా హంద్రీనీవా కాలువ పూడ్చి రోడ్డు నిర్మించిన దృశ్యం

- హంద్రీ–నీవా కాలువకు నీరు రాకుండా అడ్డుకున్నది కాంట్రాక్టర్ కాదా?
- కర్నూలు జిల్లా గార్గేయపురం వద్ద కాలువను పూర్తిగా పూడ్చి రోడ్డు వేసింది నిజం కాదా?
- వాస్తవాలు చెప్పకుండా నీటి విడుదల ఆలస్యమైందనడం సరికాదు
- కారకుడైన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్

అనంతపురం అర్బన్: వాస్తవాలు కప్పిపుచ్చి హంద్రీ,–నీవాకు నీటి విడుదల ఆలస్యమైందని చెప్పడం సరికాదని మంత్రి పయ్యావుల కేశవ్‌కు సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ హితవు పలికారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం ఆ పార్టీ కార్యదర్శి వర్గసభ్యుడు ఓ.నల్లప్పతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎగువన కర్ణాటకలో కురిసిన భారీ వర్షాల కారణంగా తుంగభద్ర డ్యామ్ గేట్లు ఎత్తివేశారన్నారు. దీంతో శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద చేరుకుంటోందని తెలిపారు. ఈ క్రమంలో శ్రీశైలం డ్యాం గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారన్నారు. అయితే బ్యాక్ వాటర్‌పై ఆధారపడిన అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు జిల్లాలకు హంద్రీ–నీవా ద్వారా చుక్క నీరు అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు కారణాలను విశ్లేషిస్తే... అనంతపురం నుంచి విజయవాడ వరకూ చేపట్టిన జాతీయ రహదారి పనుల్లో భాగంగా కర్నూలు జిల్లా గార్గేయపురం–బ్రాహ్మణకొట్కూరు మధ్య బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతోందని, అక్కడ హంద్రీ–నీవా కాలువను పూడ్చి రోడ్డు నిర్మించారని తెలిపారు. దీంతో కాలువకు నీరు విడుదల కాకుండా పోయిందన్నారు. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి... నీటి విడుదల ఆలస్యమైందంటూ మంత్రి పయ్యావుల కేశవ్ కథలు చెబుతున్నారని మండిపడ్డారు. పంటల సాగు కోసం కాలువపై మోటర్లు వేసుకుంటే రైతులపై కేసులు పెట్టి అపరాధ రుసుం వసూలు చేస్తున్నారని, అయితే ఏకంగా కాలువనే పూడ్చివేసి మూడు జిల్లాలకు నీరు అందకుండా చేసిన కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు ఎందుకు పెట్టడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతు సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే వాస్తవాలు అంగీకరిస్తూ కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హంద్రీ–నీవా అధికారులు, కాలువను పూడ్చివేసినా పట్టించుకోని జాతీయ రహదారి అధికారులపై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవాకు నీటి సాధనలో భాగంగా ఆందోళనకు సిద్ధం కావాలని రైతులకు పిలుపునిచ్చారు.

ప్రశ్నించే గొంతుకను నొక్కేస్తారా?

- సీఎం రాక సందర్భంగా ప్రజాసంఘాల నాయకుల ముందస్తు అరెస్ట్
- ఖండించిన సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్



పోలీసుల అదుపులో ఉన్న జిల్లా వ్యకాసం కార్యదర్శి పెద్దన్న, నాయకులు

పుట్టపర్తి టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా పర్యటన సందర్భంగా సీపీఎం, దాని అనుబంధ ప్రజాసంఘాల నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ అంశాన్ని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ఖండిస్తూ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రశ్నించే గొంతుకను చంద్రబాబు ప్రభుత్వం నొక్కే ప్రయత్నం చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రజా సంఘాల నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని సీఎం చంద్రబాబు అపహాస్యం చేశారని మండిపడ్డారు. పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో వ్యకాసం నాయకులు పెద్దన్న, గంగాధర్, వెంకటరమణ, రామాంజనేయులు, వీరేష్, శ్రీదేవి తదితరులను పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం అన్యాయమన్నారు. అరెస్టులపై ఉన్న శ్రద్ధ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సూపర్‌సిక్స్ పథకాల అమలుపై చూపాలని హితవు పలికారు.

రైల్వేస్టేషన్‌లో వ్యక్తి మృతి



మృతుడు రామాంజనేయులు

ధర్మవరం అర్బన్: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఓ వ్యక్తి గుండె పోటుకు గురై మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరం మండలం ఏలుకుంట్ల గ్రామానికి చెందిన రామాంజనేయులు (54) బెంగళూరులో బార్బర్ షాప్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో స్వగ్రామంలో మొహర్రం వేడుకల్లో పాల్గొనేందుకు పది రోజుల క్రితం వచ్చిన ఆయన గురువారం బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యాడు. ధర్మవరం రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైలు కోసం ఎదురు చూస్తున్న ఆయన ఉన్నఫలంగా కింద పడడంతో రైల్వే పోలీసులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

కానిస్టేబుల్‌పై యువకుల దాడి

గోరంట్ల: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌పై కొందరు యువకులు దాడి చేశారు. సీఐ సుబ్బరాయుడు తెలిపిన మేరకు... గోరంట్లకు చెందిన యువకుడు చందు తన పుట్టినరోజు సందర్భంగా గురువారం పార్టీ ఏర్పాటు చేశాడు. రాత్రి ఫుల్‌గా మందు పార్టీ ఎంజాయ్ చేసిన యువకులు స్థానిక రాజు హోటల్ సమీపంలో ద్విచక్ర వాహనాలతో హంగామా చేస్తూ చుట్టుపక్కల వారిని భయభ్రాంతులకు గురి చేశారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న కానిస్టేబుల్ వేణుగోపాలరెడ్డి... వారిని వారించబోయాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న యువకులు తమనే అడ్డుకుంటావా? అంటూ కానిస్టేబుల్‌పై బూతులతో విరుచుకుపడి ఇష్టానుసారంగా చితకబాదారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, కొందరు యువకులను అదుపులోకి తీసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రాయదుర్గం/టౌన్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని దావణగెరకు చెందిన ఈరణ్ణ (68) దాదాపు 20 ఏళ్ల క్రితం రాయదుర్గానికి వలస వచ్చి సిండికేట్ బ్యాంక్ వెనుక వీధిలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ఆయనకు భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బతుకు తెరువు కోసం హోటల్ ఏర్పాటు చేసుకున్న ఆయన అందులో నష్టాలు రావడంతో మరో హోటల్‌లో పనివాడిగా చేరాడు. కొంత కాలం క్రితం ఆ పని కూడా మానేసి కర్ణాటకలోని థియేటర్లలో పనిచేస్తూ వచ్చాడు. ఈ నేపథ్యంలో కుటుంబంలో సమస్యలు తలెత్తాయి. ఆర్థిక ఇబ్బందులూ తీవ్రమయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి పెంచుకున్న ఈరణ్ణ గురువారం తెల్లవారుజామున ఇంటి ప్రధాన తలుపునకు బయటి నుంచి గడియపెట్టి వరండాలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ADMISSIONS

■ AP EAPCET లో క్వాలిఫైడ్ స్టూడెంట్స్ కీ బి. ఫార్మసీ, B.SC (నర్సింగ్) నందు ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్ కలదు. జి.మురళి, 9030661651, ATP. [A-253]

B.Tech మేనేజ్‌మెంట్ అడ్మిషన్స్

■ AP EAPCET క్వాలిఫై కాని వారికి, ఎంట్రెన్స్ రాయని స్టూడెంట్స్ కి కాలేజీ ఫీజు ఉండదు. Only హాస్టల్ ఫీజు కట్టకోవలెను. జి.మురళి, 9030661651, అనంతపురం. [A-254]

SERVICES

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6525]

BUSINESS OFFER

■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 8376001873, 9643010487, 83760 89771, 011-25920179 [DA-5872]

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీ: 18K. ఫోన్: 9640258899, 9640468899 [H-796263]

■ అనంతపురం ప్రముఖ బ్యాంక్ నందు పనిచేయుటకు Gunman కావలెను. Age under 58. సంప్రదించండి. Cell : 9440087632, 8341006131. [A-1303]

■ ప్రముఖ జయలక్ష్మి మారుతి కార్ల డీలర్ షిప్ నందు అనంతపురం జిల్లాలో పనిచేయుటకు డిగ్రీ చదివిన & ఆటో మొబైల్స్ నందు అనుభవంకల్గిన షోరూం మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సెల్ : 9154333982 [A-762349]

■ Job Vacancy : YIP PVT LTD. Age : 18 to 45 Yrs. Qual. : 10th to Any Degree, Salary : 18000/- to 25000/- (Work From Home Available). ✆ 89789 45341. [M-1185373]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 8121818692. [M-1185372]

■ Wanted: (1) Cold Storage Plant Operators (Heavy Industry Electrical, Exp- 2 Years), (2) Banana - Field Supervisor @ Fresh Cart Agro (P) Ltd, Kld Road, Anantapur. (Interview: 03-08-2024) Cell: 8143697965. [A-1304]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అలరించిన సంగీత కచేరీ




భక్తిగీతాలు ఆలపిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్ నర్సింగ్ అండ్ అలైడ్ హెల్త్ సైన్సెస్ విద్యార్థులు గురువారం సాయంత్రం సత్యసాయి సన్నిధిలో నిర్వహించిన సంగీత కచేరీ అలరించింది. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

'అనంత' రంగస్థల దిగ్గజం 'రాఘవ'

సందర్భం: నేడు బళ్లారి రాఘవ 144వ జయంతి

- జిల్లా, రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకోనున్న జిల్లా కళాకారులు



బళ్లారి రాఘవ

అనంతపురం కల్చరల్: బళ్లారి రాఘవ... ఈ పేరు వింటే ప్రపంచ స్థాయి రంగస్థల నటులైనా ముగ్ధులైతీరుతారు. భారత ప్రభుత్వం సైతం ఆయన జ్ఞాపకార్థం ఓ పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేసి గౌరవించింది. 'మీరు మా దగ్గరికి రావడమెందుకు..మేమే మీ దగ్గరకు రావాలి., ఇంగ్లాండులో మీరు పుట్టుంటే షేక్స్‌పియర్ కంటే గొప్పవారయ్యే వారు' అని ప్రఖ్యాత కవి జార్జ్ బెర్నార్డ్‌షా... ఓ తెలుగు వాడిని... అందునా అనంత వాసిని ప్రశంసించారంటే అది ఎంత గొప్ప విషయమో మాటల్లో చెప్పేది కాదు. సహజ నటనకు కొత్త ఒరవడిదిద్ది ఏ తరం వారికైనా ప్రాతఃస్మరణీయుడిగా తనదైన ముద్ర వేసుకున్న బళ్లారి రాఘవాచార్యులు జయంతి సందర్భంగా శుక్రవారం సాయంత్రం అనంతపురంలోని లలిత కళాపరిషత్తులో ప్రత్యేక సాంస్కృతిక సంబరాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నాటకరంగ అభివృద్ధికి కృషి చేస్తున్న నటులకు, రచయితలకు పురస్కారాలనందించనున్నట్లు ఎల్కేపీ కార్యదర్శి పద్మజ తెలిపారు. పురస్కారాలను అందుకునే ప్రముఖులు గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం.

నంది నాటకమంటే గుర్తొచ్చే పేరు



వైఎస్సార్ జిల్లాకు చెందిన పల్లేటి కులశేఖర్ పేరు చెప్పగానే ఎవరికైనా అవార్డులందుకునే నంది నాటకాలు గుర్తొస్తాయి. 1982 నుంచి ఇప్పటి వరకూ మొత్తం 62 నాటకాలు రాసిన ఆయన ఎంతో మంది దిగ్గజ నటుల ప్రశంసలందుకున్నారు. ఏడు పదుల వయసులోనూ రంగస్థలమంటే అభిమానించే ఆయన వ్యక్తిగతంగాను 94 నంది అవార్డులందుకున్నారు. ఆయన కృషికి రాష్ట్ర స్థాయి బళ్లారి రాఘవ అవార్డుతో ఎల్కేపీ సత్కరించనుంది.

కళామతల్లి సేవలోనే



చిన్నాచితక పనులతో జీవనం సాగిస్తునే ప్రవృత్తి రీత్యా మంచి నటుడైన సంజీవరెడ్డిని ఈ సారి జిల్లా స్థాయి బళ్లారి రాఘవ పురస్కారాన్ని ఎంపిక చేశారు. కర్ణుడి పాత్రకు ఎనలేని పేరు తెచ్చిపెట్టిన ఆయన పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన వారు. రాముడిగా, కృష్ణుడిగా, అర్జునుడిగా.. ఏ పాత్ర వేసినా అతికినట్టుండే ఆయన మృదుస్వభావిగా అందరి మన్ననలూ అందుకున్నారు. ప్రస్తుతం కళామతల్లి సేవలోనే తరిస్తూ లలిత కళాపరిషత్తులో సాగే ప్రతి కార్యక్రమానికీ అండగా నిలుస్తున్నారు.

అభినవ మాయల మరాఠి



మాయల మరాఠి పాత్ర పేరెత్తగానే గుర్తొచ్చే పేరుగా దయానంద ముందు వరుసలో ఉన్నారు. అనంత రంగస్థలానికి విశేష సేవలందించిన ఆయన ఈసారి జిల్లా స్థాయి రాఘవ అవార్డుకు ఎంపికయ్యారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పేరూరుకు చెందిన ఆయన 1978 నుంచి పలు అవార్డులు, రివార్డులు అందుకుని అనంత ఖ్యాతిని పెంచారు.

నటుడిగా, రచయితగానూ ప్రసిద్ధి



బళ్లారి రాఘవ రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపికైన మరో దిగ్గజం మార్తాటి ఈశ్వరీ గోపాలరావు. వందలాది నాటకాల్లో తనదైన ప్రతిభను చాటుకున్న నటుడిగానే కాకుండా గొప్ప రచయితగానూ ఆయన రాణిస్తున్నారు. ప్రకాశం జిల్లా సింగరాయునికొండకు చెందిన ఆయన కొన్నాళ్లు ఉద్యోగరీత్యా అనంతలో ఉన్నారు. వీరదేవుని విజయం, భక్త కనకదాసు, షిరిడి సాయిలీలలు వంటి అనేక రచనలు ఆయన కలం నుంచి జాలువారాయి. ఇటీవల ఆయన రచించి... దివంగత వైఎస్సార్‌కు అంకితం చేసిన 'రైతు మారాజు' కావ్యాన్ని అనంతలోనే ఆవిష్కరించడం గమనార్హం. ముఖ్యంగా ఆయన రాసిన సతీసావిత్రి నాటకం ప్రదర్శించి తొలిసారి నంది అవార్డులను జిల్లా కళాకారులు అందుకున్నారు.